వ్యవసాయానికి ‘ఉపాధి’ అనుసంధానమయ్యేనా?

- 2014లోనే అనుసంధానం చేస్తామన్న అప్పటి టీడీపీ ప్రభుత్వం
- కూలీలు దొరక్క రైతుల ఇక్కట్లు
- అమలు చేస్తే రైతుకు మేలు, వ్యవసాయానికి మరింత ఊతం



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

గుడివాడరూరల్: ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలన్న డిమాండ్ రైతుల్లో వ్యక్తమవుతోంది. హామీ ఇవ్వడమే కానీ ప్రభుత్వాలు ఆచరణలో చేయడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కూలీలు ఎక్కువగా ఉపాధి హామీ పనులకు వెళ్తున్నారు. దీంతో వ్యవసాయ పనులకు కూలీల కొరత ఏర్పడుతోంది. కూలి రేట్లు పెరగడంతో పాటు వ్యవసాయ పనులు సకాలంలో పూర్తి కాక రైతులు ఇబ్బంది పడుతున్నారు. కూలీల కొరతతో అవస్థలు పడుతున్నారు. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేస్తే రైతులకు ఖర్చు తగ్గడమే కాక వ్యవసాయానికి మరింత ఊతమిస్తుంది. 2014లో టీడీపీ ప్రభుత్వం అనుసంధానం చేస్తామని హామీ ఇచ్చినా అమలు చేయలేదు. ఈ దఫా అయినా అమలు చేస్తారా అని అన్నదాతలు ఆశగా ఎదురు చూస్తున్నారు.

అనుసంధానం అవసరం

ఉపాధి పనులు వ్యవసాయానికి అనుసంధానం చేయాల్సిన అవసరం ఉంది. ఇప్పటికే ఉద్యానవన పంటలకు ఉపాధి హామీ పథకం అనుసంధానం చేశారు. ప్రభుత్వం మంజూరు చేసే ఇళ్ల నిర్మాణ పనుల్లో భాగంగా కొన్ని పనులకు మస్టర్లు వేసి కూలి డబ్బులు ఇంటి యజమానికి చెల్లిస్తున్నారు. ఈ విధంగా వ్యవసాయ రంగానికి పూర్తిగా అనుసంధానం చేయాలని రైతులు కోరుతున్నారు. ఉపాధి పనుల సీజన్‌లో వ్యవసాయానికి కూలీలు దొరక్క రైతులు అవస్థలు పడుతున్నారు.

అనుసంధానం చేస్తే మేలు

నియోజకవర్గంలో ఖరీఫ్, రబీ సీజన్‌లో వరి, మినుము, పెసర తదితర పంటలు సాగు చేస్తున్నారు. రైతులు వారి స్థోమతకు మించి పంటలు వేస్తున్నారు. అందులో వచ్చిన ఆదాయంతో జీవనం సాగిద్దామనే ఆశతో అధిక పెట్టుబడులు పెట్టి వ్యవసాయం చేస్తున్నారు. ఈ దశలో వ్యవసాయానికి ఉపాధి పథకాన్ని అనుసంధానం చేస్తే కూలి ఖర్చులు కలిసి వస్తాయని, పెట్టుబడి ఖర్చు తగ్గుతుందని రైతులు కోరుతున్నారు.

హామీ ఈసారైనా నేరవేరేనా?

2014లోనే టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేస్తామని హామీ ఇచ్చారు. అప్పట్లో ఇచ్చిన హామీని నెరవేర్చలేదు. ఐదేళ్లపాటు హామీ నెరవేరుస్తారని రైతులు ఆశగా చూసినా ఆశలు అడియాసలయ్యాయి. మళ్లీ కూటమి నేతృత్వంలో అధికారంలోకి వచ్చింది. దీనికి తోడు కేంద్రంలో బీజేపీ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉంది. కేంద్రాన్ని ఒప్పించి హామీని నెరవేర్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఈ సారైనా హామీని నెరవేర్చి రైతులకు మేలు చేయాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది. హామీని నెరవేరుస్తారా గతంలోనే మాదిగా విస్మరిస్తారా అనేది వేచి చూడాలి.

కూలీలు దొరకడం లేదు



వ్యవసాయ పనులకు కూలీలు దొరక్క ఇబ్బంది పడుతున్నాం. ఉపాధి పనులకే కూలీలు వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నారు. సకాలంలో వ్యవసాయ పనులు పూర్తి చేయలేక అవస్థలు పడుతున్నాం. ఫలితంగా నష్టాలు చవిచూస్తున్నాం. అదే వ్యవసాయ పనులకు ఉపాధి పథకాన్ని అనుసంధానం చేస్తే రైతులకు ఎంతో మేలు జరుగుతుంది.

– బి.రవి, రైతు లింగవరం

రైతుల కష్టాలు గుర్తించాలి

కూలీలు అందుబాటులో ఉండకపోవడంతో వ్యవసాయం చేయడం ఇబ్బందికరంగా ఉంది. కూలీల కొరతతో వ్యవసాయం చేయలేక కౌలుకు ఇచ్చుకునే పరిస్థితి ఏర్పడింది. ఉపాధి పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేస్తే ఖర్చులు కలసివచ్చి కూలీల కొరత తీరుతుంది. ఖర్చు తగ్గుతుంది. ప్రభుత్వం ఈ దిశగా చర్యలు తీసుకోవాలి.

– కైలే అశోక్, రైతు తటివర్రు

క్లుప్తంగా

విద్యతోనే సమాజంలో గుర్తింపు



గుడివాడరూరల్: విద్యతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని, విద్యార్థినులందరూ చక్కగా విద్యనభ్యసించి జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. మండలంలోని మోటూరు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలను ఎమ్మెల్యే బుధవారం సందర్శించారు. తొలుత పాఠశాలలోని ప్రతి తరగతికి వెళ్లి విద్యార్థినులకు అందుతున్న సౌకర్యాలు, వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి పి.జనార్దనరావు, కూటమి నాయకులు జగన్మోహనరావు, శేషగిరి, ప్రసాద్, వసతి గృహ అధికారులు పాల్గొన్నారు.

పశుసంరక్షణపై శ్రద్ధ వహించాలి



మండవల్లి: పశు సంరక్షణపై జాగ్రత్తలు చేపట్టాలని పశు సంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ వరప్రసాద్ అన్నారు. మండలంలోని భైరవపట్నం, కానుకొల్లులో బుధవారం పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. 49 పశువులకు చికిత్స చేసి, 15 ఎదకురాని పశువులకు చికిత్స చేశారు. 33 పశువులకు నట్టల నివారణ మందు, 31 లేగ దూడలకు ఏలిక పాముల నివారణ మందు తాగించారు. 371 గొర్రెలకు నట్టల నివారణ, 280 గొర్రెలకు బొబ్బరోగం నివారణ టీకాలు వేశారు. ఈ శిబిరాల ఏర్పాటులో 51 మంది పశుపోషణదారులు లబ్ధి పొందారని మండవల్లి ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు వరప్రసాద్ పేర్కొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



పామర్రు: ఏపీ ఎస్‌జీటీ అసోసియేషన్ నూతన సంవత్సర–2025 క్యాలెండర్‌ను స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అసోసియేషన్ సభ్యులు అందరూ సంఘటితంగా ఉండాలని కోరారు. అసోసియేషన్‌కు ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. వాటి పరిష్కారం కోసం తగు విధమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏపీ ఎస్జీటీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉన్ని కృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు పరీద్ బాషా, పామర్రు శాఖ అధ్యక్ష కార్యదర్శులు నగేష్, రాము పాల్గొన్నారు.

బెల్టు దుకాణాలు నిర్వహిస్తే కేసులు



కైకలూరు: గ్రామాల్లో బెల్టు దుకాణాలు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని కైకలూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ సీఐ ఎస్‌కే రమేష్ హెచ్చరించారు. నియోజకవర్గం నాలుగు మండలాల్లో బుధవారం దాడులు నిర్వహించామని తెలిపారు. ఈ దాడుల్లో ముదినేపల్లి మండలం అల్లూరు గ్రామానికి చెందిన లుక్కా ఏడుకొండలు నుంచి ఆరు మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై పి.ఆదినారాయణ, సిబ్బంది పాల్గొన్నారని చెప్పారు.

గడ్డివామి దగ్ధం



కైకలూరు: నిర్లక్ష్యం వలన చింతలచెరువు గ్రామంలో వరిగడ్డి వామి బుధవారం రాత్రి దగ్ధమైంది. గ్రామంలో రంపా నారాయణకు చెందిన ఆరు ఎకరాల వరిగడ్డికి మంటలు అంటుకున్నాయి. సమాచారంతో హుటాహుటీన వచ్చిన కైకలూరు అగ్నిమాపకశాఖ అధికారి క్రాంతికుమార్ సిబ్బందితో మంటలను అదుపు చేశారు. దీంతో సమీప గృహాలకు మంటలు వ్యాపించలేదు. మొత్తం మీద రూ.50,000 నష్టం వాటిల్లిందని అంచనా వేశారు.

అక్కినేనికి ఘన నివాళులు



అక్కినేనికి నివాళులర్పిస్తున్న కళాశాల యాజమాన్యం, విద్యార్థులు

గుడివాడ టౌన్: ప్రముఖ సినీ నటుడు పద్మ విభూషణ్ డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు వర్ధంతి స్థానిక ఏఎన్నార్ కళాశాల్లో బుధవారం నిర్వహించారు. తొలుత ఆయన విగ్రహానికి కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ కేఎస్ అప్పారావు మాట్లాడుతూ ఏఎన్నార్ కళాశాల ఏర్పాటులో అక్కినేని నాగేశ్వరరావు కృషి చిరస్థాయిగా మిగిలిపోతుందన్నారు. విద్యాభివృద్ధికి ఆయన చూపిన చొరవ, సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ బీఎస్ఎస్ పద్మజ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వెంకటరాఘవాపురంలో..

నందివాడ: నట సామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం ఆయన సొంత గ్రామమైన వెంకటరాఘవాపురంలో బుధవారం నిర్వహించారు. ముందుగా అక్కినేని చిత్రపటానికి గ్రామ ప్రముఖుడు మేరుగుమాల లక్ష్మణరావు ఆధ్వర్యంలో గ్రామస్తులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ తమ గ్రామం పంచాయతీగా ఏర్పడేందుకు అక్కినేని చేసిన కృషి మరువలేమన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అక్కినేని అభిమాని జి.రామకృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.



వెంకటరాఘవాపురంలో అక్కినేని వర్ధంతి

ఆటోనగర్ సమస్యలు పరిష్కరిస్తాం



ఆటోనగర్ వ్యాపారులతో మాట్లాడుతున్న అధికారులు

గుడివాడ టౌన్: గుడివాడ ఆటోనగర్‌లో తలెత్తిన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఐలా కమిషనర్ సాంబశివరావు అన్నారు. బుధవారం ఆయన శానిటరీ ఇన్‌స్పెక్టర్ అప్పారావుతో కలిసి ఆటోనగర్‌లో పర్యటించారు. అనేక సమస్యలు ఆటోనగర్ వ్యాపారులు, పరిశ్రమల యజమానులు ఆయన దృష్టికి తెచ్చారు. ప్రత్యేకించి చెత్త సమస్య అధికంగా ఉందని, దానిని పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. చెత్త ఎక్కడపడితే అక్కడ వేయకుండా చెత్త సేకరించే వారికి వ్యాపారులు సహకరించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కృష్ణా జిల్లా ఇండస్ట్రియల్ అండ్ ఆటోమొబైల్ వర్కర్స్ యూనియన్ గుడివాడ అధ్యక్షుడు అబ్దుల్ హమీద్(అమీర్), ప్రధాన కార్యదర్శి ఖుర్దూస్, సీఐటీయూ పట్టణ కార్యదర్శి టి. లక్ష్మణరావు, సభ్యులు బి.ఆంజనేయులు, ఎండీ రషీద్ బేగ్, ఎస్ఎం మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

నేర పరిశోధనలో సీసీ కెమెరాల పాత్ర కీలకం



సీసీ కెమెరాల ఏర్పాటును పరిశీలిస్తున్న సీఐ కృష్ణ, ఎస్ఐ వెంకట్‌కుమార్

కైకలూరు: నేర పరిశోధనలో సీసీ కెమెరాల పాత్ర నేటి సమాజంలో గణనీయంగా పెరిగిందని కైకలూరు పట్టణ సీఐ పి.కృష్ణ పేర్కొన్నారు. దొంగతనాల నివారణలో వ్యాపారుల సహాయ నిమిత్తం కైకలూరు బంగారపు దుకాణ యజమానులతో బుధవారం స్టేషన్‌లో సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ కైకలూరు పట్టణంలో ప్రత్యేక ప్రాజెక్టుగా సీసీ కెమెరాల ఏర్పాటు చేయనున్నామన్నారు. ఒక సీసీ కెమెరా ఇద్దరు పోలీసు సిబ్బందితో సమానమన్నారు. దుకాణదారులు దాతలుగా వ్యవహరించి సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. ప్రతి దుకాణం వద్ద కెమెరా ఏర్పాటు చేస్తే దొంగతనాలను అరికట్టొచ్చన్నారు. కైకలూరు ఎన్జీఓ కాలనీలో డీసీఎస్ రాజు సహకారంతో రెండు సీసీ కెమెరాలను బుధవారం ఏర్పాటు చేశామన్నారు. పట్టణ ఎస్ఐలు డి.వెంకట్‌కుమార్, ఆర్.శ్రీనివాస్ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానంతో నేరాలను అదుపు చేయొచ్చన్నారు. పట్టణంలో ప్రధాన కూడళ్లు, అన్ని ప్రధాన ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తామన్నారు.

వెబినార్‌ను సద్వినియోగం చేసుకోవాలి

కైకలూరు: మెటీరియల్ సైన్స్ విభాగ పరిశోధనలపై కైకలూరు వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, ఏలూరు ప్రభుత్వ కాలేజీ, నగరం ఎస్వీఆర్ఎం ప్రభుత్వ డిగ్రీ కాలేజీలు సంయుక్తంగా గురు, శుక్రవారాల్లో అంతర్జాతీయ, జాతీయ స్థాయి వెబినార్ నిర్వహిస్తున్నట్లు కైకలూరు కాలేజి ప్రిన్సిపాల్ వై.శ్రీలత చెప్పారు. ఈ కార్యక్రమాన్ని రెండు రోజులు మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహిస్తారని పేర్కొన్నారు. మొదటి రోజు మంగళగిరిలో కాలిజేట్ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్ సీహెచ్ కృష్ణ వెబినార్‌ను ఆన్‌లైన్‌లో ప్రారంభిస్తారని తెలిపారు. ప్రభుత్వ అధ్యాపకులతో పాటు విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గుండెపోటుతో ఆర్‌టీసీ డ్రైవర్ మృతి

వానపాముల(పెదపారుపూడి): మండలంలోని వానపాముల గ్రామానికి చెందిన గుడివాడ ఆర్‌టీసీ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్న లంకపల్లి ప్రసాద్ (61) బుధవారం సాయంత్రం గుండెపోటుతో మృతి చెందారు. ప్రసాద్‌కు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పరామర్శ

డ్రైవర్ లంకపల్లి ప్రసాద్ భౌతికాయానికి మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసాద్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. డ్రైవర్ కుమారుడు వైఎస్సార్ సీపీ నేత లంకపల్లి రాజేష్‌ను అనిల్‌కుమార్ ఓదార్చారు. అన్ని విధిలా అండగా ఉంటామన్నరు.

సూర్యఘర్ పథకాన్ని వినియోగించుకోండి : కలెక్టర్

చిలకలపూడి(మచిలీపట్నం): పీఎం సూర్య ఘర్ పథకాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో బుధవారం ఈ పథకం లబ్ధిదారులతో మాట్లాడి దాని వల్ల వచ్చే ప్రయోజనాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. మచిలీపట్నం నగరంలోని చింతగుంటపాలెంకు చెందిన చోడవరపు ప్రసూన, కొంపెర్ల సుబ్బారావు పథకం ద్వారా పొందిన ప్రయోజనాలను కలెక్టర్‌కు వివరించారు. మొదట్లో తమకు కరెంటు బిల్లులు రూ.3 వేల వరకు వచ్చేవని సోలార్ ప్యానల్ ఏర్పాటు చేసుకున్న తరువాత ఇంటి అవసరాలకు పోను మిగులు విద్యుత్ ఉండటం వల్ల ఆదాయం లభిస్తుందన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి ఈ పథకం దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో అమలు చేస్తున్నారని తెలిపారు. బ్యాంకు ద్వారా రుణ సౌకర్యం కల్పిస్తోందన్నారు. పథకం వివరాల కోసం జిల్లా నోడల్ అధికారి ఎం.భాస్కరరావు (77804 56319)ను సంప్రదించాలన్నారు.

రీసర్వే పనుల పరిశీలన

పాములపాడు(పెదపారుపూడి): గ్రామాల్లో నిర్వహిస్తున్న రీసర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ వై. రంగారావు అన్నారు. మండలంలోని పాములపాడు పొలాల్లో జరుగుతున్న రీసర్వేను తహసీల్దార్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రైతుల భూసమస్యల పరిష్కారం కోసమే రీసర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మినుములో యాజమాన్య పద్ధతులు ముఖ్యం

కైకలూరు: మినుము పైరులో యాజమాన్య పద్ధతులు ముఖ్యమని ఏరువాక కేంద్రం, ఏలూరు శాస్త్రవేత్త డాక్టర్ ఫణికుమార్, జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ లలిత సుధారాణి అన్నారు. కైకలూరు మండలం ఆచవరం, వింజరం తదితర గ్రామాల్లో అపరాల సాగుపై క్షేత్ర స్థాయి అవగాహన రైతులకు బుధవారం కల్పించారు. కైకలూరు ఏడీఏ ఆర్.గంగాధరరావు, వ్యవసాయాధికారులు ఆర్.దివ్య, కె.విద్యాసాగర్, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు. శాస్త్రవేత్త మాట్లాడుతూ ఈ ప్రాంత పైరులో మారుక మచ్చలపురుగు, పొగాకు లద్దె పురుగు, పల్లాకు, బుడిత తెగుళ్లను గుర్తించామన్నారు. మినుము పూత దశలో ఆశించే మారుక మచ్చల పురుగు నివారణకు పైరు పూ మొగ్గ దశలో వేప నూనె 1500 పీపీఎం లీటరు నీటికి ఐదు మిల్లీ లీటర్ల చొప్పున పిచికారీ చేయాలన్నారు. పల్లాకు తెగులు నివారణకు థియోమెథాక్సం 0.2 గ్రాము లేదా అసిటమిప్రిడ్ 0.2 గ్రాము లేదా ఎసిఫేట్ 1.0 గ్రాము లీటరు నీటికి చొప్పున పిచికారీ చేసుకోవాలని చెప్పారు. బూడిద తెగులు నివారణకు హెక్సాకనజోల్ రెండు మిల్లీ లీటర్లను లీటరు నీటికి లేదా ప్రాపికనజోల్ ఒక మిల్లీ లీటరును లీటరు నీటికి లేదా కార్బెండజిం ఒక గ్రాము లీటరు నీటికి చొప్పున పిచికారీ చేసుకోవాలని సూచించారు.

తెగుళ్ల నివారణకు చర్యలు చేపట్టాలి

గుడివాడరూరల్: మినుము సాగులో వస్తున్న సీతాఫలం, బొబ్బర తెగుళ్లకు రైతులు సత్వర నివారణ చర్యలు చేపట్టాలని ఏఓ బోలెం అనంతలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని కల్వపూడి అగ్రహారం, గుంటాకోడూరు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత ఆయా గ్రామాల్లోని మినుము పంట పొలాలను పరిశీలించి రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మినుము సాగులో సీతాఫలం, బొబ్బర తెగుళ్ల ఎక్కువగా కన్పిస్తున్నాయని ఈ తెగుళ్ల పేనుబంక ద్వారా వచ్చి ఒక మొక్క నుంచి మరో మొక్కకు వ్యాప్తి చెందుతాయన్నారు. వీటి నివారణకు యాషిపెట్ 1.0 గ్రాములు, ఇమిడియాకోలాప్రైడ్ 0.4 మిల్లీ లీటర్లు, యాస్టిమియాప్రైడ్ 0.2 గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని రైతులకు సూచించారు. వీఏఏ డి.స్నేహ, ఎంపీఈఓ కె.ఆశాలత పాల్గొన్నారు.



కైకలూరు మండలంలో అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు



గుడివాడ మండలంలో మాట్లాడుతున్న ఏఓ అనంతలక్ష్మి



పామర్రు మండలం ఎలకుర్రులో రైతులతో మాట్లాడుతున్న ఏఓ శివనాగరాణి

పేను బంక పురుగును నివారిస్తే అధిక దిగుబడులు

ఎలకుర్రు(పామర్రు): మినుము సాగులో వచ్చే పేను బంక పురుగును నివారిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏఓ శివనాగరాణి పేర్కొన్నారు. మండలంలోని ఎలకుర్రు, కొరిమెర్ల గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. క్షేత్ర స్థాయిలో మినుము పంటను సందర్శించి, రైతులకు సమగ్ర సస్య రక్షణపై వివరించారు. అనంతరం ఏఓ మాట్లాడుతూ ప్రస్తుతం మినుములో పేను బంక పురుగును గుర్తించామన్నారు. దీని నివారణకు ఒక లీటరు నీటికి 1.5 మిల్లీ లీటర్ల ఎండో సల్ఫాన్ లేదా ఎసిఫేట్ ఒక గ్రాము చొప్పున కలిపి పిచికారీ చేయాలన్నారు. ప్రస్తుతం బూడిద తెగులు కూడా మినుములో గుర్తించామన్నారు. దీని నివారణకు కార్బండజిమ్ ఒక గ్రాము ఒక లీటరు నీటిలో కలిపి 10 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలన్నారు. రైతులు అందరూ ఫార్మర్ ఐడీని పొందాలని తెలిపారు.

25 నుంచి త్యాగరాజ ఆరాధనోత్సవాలు

ముదినేపల్లి రూరల్: మండలంలోని సింగరాయపాలెం బావాజీమఠంలోని కోదండరామస్వామి ఆలయంలో ఈ నెల 25 నుంచి 27 వరకు శ్రీత్యాగరాజు స్వామివారి ఆరాధన మహోత్సవాలు నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్‌లోని నాయీబ్రాహ్మణ, కళాకారుల ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు జరుగుతాయని పేర్కొన్నారు. ఉత్సవాల్లో భాగంగా 25న ఉదయం త్యాగరాజు స్వామివారి చిత్రపటాన్ని స్థానిక శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి ఆలయం నుంచి మంగళ వాయిద్యాలతో బావాజీ మఠం వరకు తీసుకొచ్చి గణపతి పూజ నిర్వహిస్తారని తెలిపారు. 26న స్వామివారి పూజ, సుదర్శన హోమం నిర్వహిస్తామన్నారు. చివరి రోజైన 27న సీతారాముల శాంతి కల్యాణంతోపాటు వృద్ధ కళాకారులకు సన్మానం చేసి, రాత్రికి అఖండ అన్న సమారాధన నిర్వహిస్తామని తెలిపారు.

విధి నిర్వహణలో బాధ్యతతో వ్యవహరించాలి

గుడివాడరూరల్: విధి నిర్వహణలో పోలీస్ సిబ్బంది బాధ్యతగా వ్యవహరించి ఉన్నతాధికారుల ఆదేశాలను పాటించాలని గుడివాడ తాలూకా ఎస్ఐ ఎన్.చంటిబాబు అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో బుధవారం స్టేషన్ అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలన్నారు. ఏఎస్ఐ వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటింట చెత్త సేకరణ

గుడివాడ టౌన్: స్వచ్ఛ గుడివాడ రూపకల్పనలో భాగంగా ఇంటింట చెత్త సేకరించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద రూ. 24 లక్షలతో ఏర్పాటు చేసిన 100 పుష్కార్ట్‌ను ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటు చేసిన ఈ తోపుడు బళ్లు ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరిస్తాయన్నారు. ప్రతి 350 ఇళ్లకు రూట్ మ్యాప్ ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి. శ్రీనివాసరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

కాల్వలను బాగు చేయించాలని వినతి

గుడ్లవల్లేరు: కౌతవరం ఇరిగేషన్ సబ్ డివిజన్ పరిధిలోని కాల్వలను బాగు చేయించాలని రైతులు కోరారు. కౌతవరం ఇరిగేషన్ డీఈ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సాగునీటి సమావేశానికి గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ వచ్చారు. కాల్వలపై జంగిల్ క్లియరెన్స్‌తో పాటు ఇతర సమస్యలను తీర్చాలని ఎమ్మెల్యేలను రైతులు కోరారు. కార్యక్రమంలో డీసీ చైర్మన్ మల్లిపెద్ది సుబ్రహ్మణ్యం, టీడీపీ నాయకులు శలపాటి ప్రసాద్, కొడాలి రామరాజు, పెన్నేరు రమేష్, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

రాధాకృష్ణకు డీఎన్నార్ పరామర్శ



కైకలూరు: అనారోగ్య సమస్యతో ఇంటి దగ్గర విశ్రాంతి తీసుకుంటున్న విశాలాంధ్ర విలేకరి రాధాకృష్ణను వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) బుధవారం పరామర్శించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడారు. త్వరగా కోలుకునేలా చూడాలని చెప్పారు.

తోట్లవల్లూరు ఎస్ఐపై బదిలీ వేటు

తోట్లవల్లూరు: తోట్లవల్లూరు ఎస్ఐ ఎం. అర్జునరాజుపై బదిలీ వేటు పడింది. ఆయన్ను వీఆర్‌కు పంపుతూ జిల్లా ఎస్పీ గంగాధరరావు మంగళవారం రాత్రి ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. అర్జునరాజు స్థానంలో వీఆర్‌లో ఉన్న అవినాశ్‌ను ఎస్ఐగా నియమించినట్లు సిబ్బంది చెబుతున్నారు. గత ఏడాది ఆగస్టు 6న తోట్లవల్లూరు ఎస్ఐగా అర్జునరాజు బాధ్యతలు చేపట్టారు. ఆరు నెలలు కూడా గడవక ముందే ఆయనపై బదిలీ వేటు పడింది.